‘జన్‌మన్‌రేగా’తో పారదర్శకత

- ‘ఉపాధి’ వివరాలు తెలుసుకునేందుకు వీలుగా యాప్ రూపకల్పన
- కూలీలకు అవగాహన కల్పించనున్న అధికారులు


పని ప్రదేశంలో ఉపాధి కూలీలు



జనమన్‌రేగా యాప్

దేవరకొండ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనేక సొబగులు దిద్దుకుంటుంది.ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనుల్లో పారదర్శకతకు అద్దం పట్టేలా అన్ని వివరాలు అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం తాజాగా జన్‌మన్‌రేగా యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో పారదర్శకత కోసం బ్యాంక్, పోస్టాఫీస్ ఖాతాల్లో కూలీల నగదు జమ చేసే చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. కాగా కొందరు కూలీల ఖాతాల వివరాలు అనుసంధానం కాకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బందులు చోటుచేసుకున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సమగ్ర వివరాలు తెలుసుకునేలా కూలీల కోసం కేంద్రం ప్రభుత్వం ఇటీవల జన్‌మన్‌రేగా యాప్‌ను ఆవిష్కరించింది.

యాప్ పనితీరు ఇలా..

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కూలీలు స్మార్ట్‌ఫోన్‌లో జనమన్‌రేగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.అందులో కూలీల హాజరు, నగదు జమ విభాగం క్లిక్ చేస్తే సంబంధింత సమాచారం కనపడుతుంది. అందులో రాష్ట్రం, జిల్లా, జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య వంటి వివరాలు నమోదు చేస్తే కూలీలకు సంబంధించి సమాచారం క్షణాల్లో మొబైల్ ఫోన్‌లో ప్రత్యక్షమవుతాయి. కూలీ నగదు జమ కానట్లయితే అందుకు గల కారణాలు సైతం స్పష్టంగా కనిపిస్తాయి. అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల సమాచారం, స్థానిక సమస్యలపై ఫిర్యాదులకు కూడా అవకాశం కల్పించారు.ఇదిలా ఉంటే సంబంధిత యాప్ అన్ని భాషల్లో వివరాలు ఉంటాయి.

కూలీలకు అవగాహన కల్పించాలి



జన్‌మన్‌రేగా యాప్‌పై సంబంధిత అధికారులు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలి. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యాప్ ఉపయోగం, వివరాలు తెలుసుకోవడం వంటి విషయాలను వారికి క్లుప్తంగా వివరించాలి. ఇందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– కంబాలపల్లి ఆనంద్

యాప్‌ను వినియోగించుకోవాలి



జన్‌మన్‌రేగా యాప్‌ను ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు వినియోగించుకోవాలి. ఉపాధి వివరాలు సొంతంగా కూలీలు మొబైల్ ద్వారా తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు.

– రామచంద్రం, ఏపీఓ, దేవరకొండ

క్లుప్తంగా

మిర్యాలగూడ ట్రాన్స్‌కో డీఈ బదిలీ

మిర్యాలగూడ అర్బన్ : ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస సుధీర్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు నెలల క్రితం మిర్యాలగూడ డీఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనను భువనగిరి ఎస్ఈ కార్యాలయానికి బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసచారిని మిర్యాలగూడ డీఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా సిబ్బంది ప్రమోషన్ల విషయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని సంఘాల నాయకులు డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడం, పరస్పర వినతిపత్రాలు అందించడంతో శ్రీనివాస సుధీర్‌కుమార్‌పై బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

మిల్లర్లు లెవీని త్వరగా పూర్తిచేయాలి

చింతపల్లి : మిల్లర్లు లెవీని త్వరగా పూర్తిచేయాలని పౌరసరఫల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నసర్లపల్లి రైసు మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ మాత్రమే కాక లేని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా మిల్లులోని రికార్డులను, ధాన్యం విలువను ఆయన పరిశీలించారు.

ఛత్రపతి శంభాజీ మహరాజ్‌కు నివాళి

దేవరకొండ : ఛత్రపతి శంభాజీ మహరాజ్ 336వ వర్ధంతిని మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ శంభాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంభాజీ మహరాజ్ చిన్ననాటి నుంచి యుద్ధభూమి ప్రచారాలకు గురయ్యాడని తెలిపారు. మరాఠా సామ్రాజ్యానికి రాజుగా ఉన్న సందర్భంలో ప్రజలు సుఖ సంతోషాలతో విరాజిల్లారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి, వరికుప్పల శ్రీను, పున్న వెంకటేష్, శ్రీను, మాకం చంద్రమౌళి, లక్ష్మణ్, దశరథ గౌడ్, తదితరులున్నారు.

తిరుమలనాథస్వామి ఆలయ వార్షికోత్సవం

గుర్రంపోడు : మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులోని తిరుమలనాథ స్వామి ఆలయ వార్షిక మహోత్సవాల సందర్భంగా మంగళవారం సుదర్శన హోమం, సింధూరాభిషేకం. ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీదేవిగూడెం, కోయగూరవానిబావి, ఆరెగూడెం, కొప్పోలు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత

డిండి : మండడల పరిధిలోని కందుకూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 92, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 405 మంది విద్యార్థులకు జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకు వచ్చిన జేఎస్‌డబ్ల్యూ సంస్థకు పాఠశాల ఉపధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, పాలిమ, నారాయణరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, శ్రీనయ్య, ఆయా పాఠశాల ఉపధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామంలో శాలివాహన కాలంలో నిర్మించిన పురాతన దేవాలయంలో కోలువై ఉన్న అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమై కొనసాగుతున్నాయి. మంగళవారం గడుడసేవ, పరమపద ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 14న స్వామి వారి తిరు కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయం ఈఓ నవీన్, చైర్మన్ యడవెల్లి విజయ్ కుమార్ రెడ్డిలు తెలిపారు. చుట్ట పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఏత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

నల్లగొండ టౌన్ : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఆవుట రవీందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ అద్దెలు రేషియో ప్రకారం చెల్లించాలని, మెటీరియల్ రవాణా చార్జీలు ప్రాజెక్టు అధికారులే చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలల ఏరియర్స్, 24 రోజుల సమ్మె కాలం వేతనాలు చెల్లించాలన్నారు. ధర్నాలో కె విజయలక్ష్మి, పి సరిత, ప్రమీల, మనిరూప, రాజేశ్వరి, పాదూరు లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


గ్రంథాలయంలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మేరెడ్డి రామ చంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు వంద రోజుల పాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆ గ్రంథాలయంలో పట్టణానికి చెందిన మిల్లర్ గుడిపాటి శ్రీనివాస్ –అనిత దంపతుల వివాహ వార్షికోత్సవంతో పాటు పాల్వాయి నర్సింహారెడ్డి కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ మిర్యాలగూడ, రైస్ మిల్లర్ల సహకారంతో వంద రోజుల పాటు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ అభివృద్ధి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మధ్యాహ్నం భోజనం పెట్టేందుకు ముందుకు వచ్చిన లయన్స్‌క్లబ్, రైస్ మిల్లర్లను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు తారకేశ్వరీ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, మాజీ కౌన్సిలరర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, క్లబ్ అధ్యక్షులు లింగయ్య, కోశాధికారి బిఎం నాయుడు, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, జాడీ రాజు, పాశం మాధవరెడ్డి, ఏచూరి మురహరి, భాగ్యలక్ష్మి, రాంబాబు, సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విజయభాస్కర్‌రావు పాల్గొన్నారు.

నాట్కోట్రస్టు సేవలు అభినందనీయం


నాయకునితండాలో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కొన్నేళ్లుగా నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు మేరావత్ మునినాయక్ అన్నారు. మంగళవారం నాట్కోట్రస్టు ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ధూళిపాల సహకారంతో మండలంలోని నాయకునితండాలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో పదహారు గ్రామాల ప్రజలకు నాట్కోట్రస్టు సేవా కార్యక్రమాలు అందిస్తుందని తెలిపారు. ట్రస్ట్ అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 142మంది పాల్గొనగా వారికి ఐస్క్రీనింగ్ చేసి, 70మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందని డాక్టర్ మురళీధర్ తెలిపారు. దూరపు చూపు, దగ్గరి చూపు మందగించడంతో 35 మంది ఇబ్బందులు పడుతున్నారని వారికి నాట్కోట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, అద్దాలు ఇవ్వనున్నట్లు ట్రస్టు ప్రతినిధి జీఎల్ఎన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఐ హాస్పిటల్ దూళిపాల కోఆర్డినేటర్ మల్లేష్, ట్రస్టు సిబ్బంది నాగమణి, చీనా, లక్ష్మా, కాశయ్య, వస్త్రం పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- మున్సిపల్ కమిషనర్ యూసుఫ్


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్‌పై 25శాతం రాయితీని కల్పించినందున ఈ అవకాశంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సబ్ రిజిస్టర్ బుర్రివేణి బలరామ్ యాదవ్‌తో కలిసి లైసెన్స్ టెక్నికల్ ఫర్సన్స్ ఇంజనీర్లు, డాక్యుమెంట్ రైటర్స్, సబ్ రిజిస్టర్ సిబ్బందితో కలిసి నిర్వహించి ఎల్‌ఆర్‌ఎస్ 25శాతం రాయితీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో భవన నిర్మాణాలను చేపట్టే వారు ఇంటి పర్మిషన్ కోసం వచ్చే సమయంలో తప్పని సరిగా ఎల్‌ఆర్‌ఎస్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రిజిస్టర్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టిన తరువాత ప్రొసిడింగ్ కాపీని మున్సిపల్ కార్యాలయంలో తీసుకునే అవకాశం ఉందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కట్టి ఉంటే సబ్ రిజిష్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 11, నందిపాడులో ఒకటి లే అవుట్లు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో ప్లాట్ల వివరాలతో పాటు అన్ని డాక్యుమెంట్లు ఉండాల్సి ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో 2020 కంటే ముందుగా మొత్తం 14 వేల 320 మంది దరఖాస్తులు చేసుకుంటే వీటిలో 4112 దరఖాస్తులు నిషేధిత భూములు ఉన్నాయని, 8143 వరకు అంతా క్లీయర్‌గా ఉన్నాయని, 576 పరిశీలనలో ఉండగా 33 వరకు వివిధ కారణాలతో రిజక్ట్ అయ్యాయని, 251 మంది పేమెంట్లు పూర్తి స్థాయిలో చెల్లించగా మున్సిపాలిటికి 2 కోట్ల 4లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) అంజయ్య తదితరులున్నారు.

వన్‌టౌన్ సీఐగా మోతీరాం బాధ్యతల స్వీకరణ



మిర్యాలగూడ అర్బన్ : వన్ టౌన్ సీఐగా చింత మోతీరాం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా రామన్నపేట, నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్, భువనగిరి, భూదాన్‌పోచంపల్లిలో విధులు నిర్వర్తించారు. సీఐగా ప్రమోషన్ వచ్చాక రాచకొండ కమిషనరేట్ పరిధిలోని రామన్నపేట ఇంటలిజెన్స్ విభాగంలో పని చేశారు. క్రైం బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా ఉన్నాతాధికారులు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని, గంజాయి, డ్రగ్స్, చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు ప్రారంభిస్తామని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి 10గంటల తరువాత రోడ్లపై ఉండే యువతపై దృష్టి సారిస్తామని తెలిపారు. శాంతి భద్రత విషయంలో చట్టప్రకారం చర్యలుంటాయని పేర్కొన్నారు.

కార్యాలయాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి


మార్కెట్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తిరుమలగిరి మండలానికి చెందిన నాయకులు మంగళవారం మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంగా ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మార్కెట్ యార్డులో స్థలాన్ని కేటాయించినట్లయితే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శాగం శ్రవణ్ కుమార్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


ఇటుకల బట్టీలు పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ

చింతపల్లి : మండల పరిధిలోని నసర్లపల్లిలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నిర్కవ్వాహకులు నిబంధనలు పాటించాని మైనింగ్ ఏడీ సామిల్ జాకప్ సూచించారు. మంగళవారం నసర్లపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలను ఆయన గ్రామ ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో గ్రామంలోని ఇటుకల బట్టీలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఇటుక బట్టీల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించి నిర్వహించాలని సూచించారు. పంచాయతీ అనుమతులు మైనింగ్ అనుమతులు లేకుండా బట్టీలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ రమాకాంత్ శర్మ, ఎంపీడీఓ సుజాత, ఆర్ఐ సునీతతో పాటు అధికారులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..


చింతపల్లి : పీకే మల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

చింతపల్లి : మండల పరిధిలోని పీకే మల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, ఆర్ లక్ష్మి, ఎం.సుజాత, విద్యార్థిని విద్యార్థులు, పేరెంట్స్, గ్రామ పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలి


రైతులతో మాట్లాడుతున్న కంబాలపల్లి ఆనంద్

పెద్దఅడిశర్లపల్లి : నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పడిన తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పావురాల గట్టులో సీపీఎం పోరుబాటలో భాగంగా గ్రామ సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన గిరిజన తండాల్లో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, చందూనాయక్, రైతులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ వాసికి గ్రూప్- 2లో 104వ ర్యాంకు


వీరశేఖర్ వర్మ

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన గ్రూప్ -2 పరీక్ష ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన జుట్టుకొండ నాగేశ్వర్ –చంద్రకళ దంపతుల కుమారుడు వీర శేఖర్ 104వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా ఇటీవల విడుదలైన గ్రూప్ –4 ఫలితాల్లో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా నియామకమయ్యాడు. ప్రస్తుతం మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. వీరశేఖర్‌కు డిప్యూటీ తహసీల్దార్ కావాలనే కోరిక ఉంది.

పట్టపగలే ఇంట్లో చోరీ

దేవరకొండ : పట్టపగలే ఇంట్లో చోరీకి పాల్పడ్డ ఘటన మంగళవారం దేవరకొండ మండలంలో చోటు చేసుకుంది. సీఐ నరసింహులు తెలిపిన వివరా ప్రకారం మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన జక్కుల పెద్దవెంకటమ్మ గ్రామంలోని తన పొలానికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. ఇంట్లోని బీరువాలో ఉన్న 22తులాల వెండి, పావుతులం బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లలో నాణ్యత లేదు

నల్లగొండ టూటౌన్: ఇందిరమ్మ ఇళ్లలో నాణ్యత లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలుచేయలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు.

పొంచి ఉన్న ప్రమాదం


విద్యుత్ స్తంభం కారణంగా పగిలిన తాగునీటి పైపులైన్

మిర్యాలగూడ : పట్టణంలోని బంగారుగడ్డ 30వ వార్డులో ఇటీవల వేసిన విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇటీవల విద్యుత్ సిబ్బంది ఈ స్తంభాన్ని తాగునీటి పైపులైన్ వద్దనే ఏర్పాటు చేయడంతో తాగునీటి పైపులైన్ పగిలి మడువగా ఏర్పడి రోడ్డు వెంట కాల్వలా పారుతుంది. దీంతో స్తంభం బలహీనపడి ఒరిగి కిందపడితే విద్యుదాఘాతానికి గురై వాహనదారులు, ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదని పలువురు కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ స్థలంలో స్తంభం ఏర్పాటు చేయవద్దని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా స్తంభాన్ని ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. తాగునీటి పైపులైన్ పగిలి వారం రోజులు కావొస్తున్నా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకపోవడంతో నీటి వృథా జరిగి వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి ఆ స్తంభాన్ని తొలగించి మున్సిపల్ అధికారులు పగిలిన పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అల్లి కీర్తన యాదవ్‌కు అభినందనలు


కీర్తన యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూపు –1 మెయిన్స్ ఫలితాల్లో 462.5 మార్కులతో విజయం సాధించిన ఉమ్మడి అనుముల మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అల్లి నాగమణి, పెద్దిరాజు దంపతుల కుమార్తె అల్లి కీర్తన యాదవ్‌ను మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, గొనీ రాజా రమేష్ యాదవ్, రామచంద్ర యాదవ్, కాశీ యాదవ్, సైదులు యాదవ్, గోవిందు యాదవ్, బాలరాజు యాదవ్, కొండలు యాదవ్, వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దేవరకొండ : పీఏపల్లి మండల కేంద్రంలో ఈనెల 16,17తేదీల్లో నిర్వహించనున్న లింగమంతుల స్వామి బ్రహ్మోత్సవాల ప్రచార పోస్టర్‌ను మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పండుగలు, ఉత్సవాలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపి సిరాజ్‌ఖాన్, తేరా సత్యనారాయణరెడ్డి, తేరా మణిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, కొండల్ యాదవ్, ఎల్లేష్‌యాదవ్, కృష్ణ య్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కంకర వేశారు.. బీటీ మరిచారు


కొప్పోలు వద్ద ప్రధాన రహదారిపై పరిచిన కంకర

గుర్రంపోడు : నల్లగొండ – దేవరకొండ ప్రధాన రహదారిపై బీటీ ప్యాచ్ వర్క్ పనులు నత్తకే నడక నేర్పేలా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధ్వానంగా ఉన్న నల్లగొండ దేవరకొండ ప్రధాన రహదారిపై మండల పరిధిలో దెబ్బతిన్న చోట్ల మరమ్మతులకు రూ.10కోట్లు మంజూరయ్యాయి. దెబ్బతిన్న భాగంలో లోతుగా తవ్వి కొత్తగా ప్యాచ్ వర్క్ చేయాల్సి ఉంది. మండల పరిధిలోని తుర్కోనిబావి, కట్టవారిగూడెం గ్రామాల పరిధిలో ప్యాచ్ వర్క్ చేయగా చామలేడు క్రాస్ రోడ్డు, గుర్రంపోడు శివారులో దెబ్బతిన్న చోట్ల ఇటీవల తవ్వి కంకర పరిచి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు బీటీ వేయడం లేదు. ఇలా పాల్వాయి వరకు ప్యాచ్ వర్క్‌లో భాగంగా దెబ్బతిన్న చోట్ల రోడ్డు తవ్వి కంకర వేశారు. ఎండాకాలంలో వాహనదారులు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుర్రంపోడు బ్రిడ్జిపైన కూడ మరమ్మతులు చేయాల్సి ఉంది. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా కంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ అనితను ప్రశ్నించగా కంట్రాక్టరుకు త్వరగా బీటీ వేయాలని కోరామని, కూలీల కొరతతో ఆలస్యమవుతుందరి కంట్రాక్టరు చెబుతున్నాడని తెలిపారు.

శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయం

మిర్యాలగూడ : డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్‌కు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయమని దామరచర్ల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ దక్కడంలో కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.